వార్డు అధికారులకు అందని వేతనాలు

- ఉద్యోగంలో చేరి మూడు నెలలు
- ఇంకా బిల్లులు చేయని బల్దియా
- తొలి జీతం కోసం ఎదురుచూపు

వరంగల్, ఏప్రిల్ 8: ఉద్యోగం చేరి మూడు నెలలవుతున్నా వార్డు అధికారులు మొదటి వేతనం తీసుకోలేదు. బల్దియాలో వార్డు అధికారులుగా 29 మంది, జూనియర్ అకౌంట్ అధికారులుగా నలుగురు, జూనియర్ అసిస్టెంట్‌గా ఒకరు జనవరిలో ఉద్యోగంలో చేరారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని, నెలనెలా వేతనం ఠంచనుగా వస్తుందని సంబురపడిన వారికి మూడు నెలలవుతున్నా చేతికి వేతనం రాలేదు. దీనిపై బల్దియా సాధారణ పరిపాలన విభాగంలో అడిగితే ఈ నెలలో వస్తుందిలే అంటున్నారని వార్డు అధికారులు చెబుతున్నారు.

ఎల్ఆర్ఎస్, పన్ను వసూళ్లలో కీలకం

ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తుల పరిశీలన, పన్నుల వసూళ్లలో వార్డు అధికారులు కీలకంగా పనిచేశారు. పన్ను వసూళ్లలో టార్గెట్లు విధించడంతో కొత్తగా ఉద్యోగంలో చేరిన వార్డు అధికారులు భయంతో వణికిపోయారు. అర్ధరాత్రి వరకు పన్ను వసూళ్ల పనిలో నిమగ్నమై లక్ష్యాలను చేరుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వీరిని వినియోగించుకున్నారు. మూడు నెలల ఉద్యోగ పని ఒత్తిడిలో అతలాకుతలమయ్యారు. కానీ, వేతనాలు అందక సంతోషం లేకుండా పోయింది. తొలి వేతనాన్ని కూడా అందుకోకుండా మూడు నెలలుగా వేచి చూస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెలలో వేతనాలు చేసి పంపుతాం..

బల్దియాలో వార్డు అధికారుల వేతనాలు సాధారణ పరిపాలన విభాగం సిబ్బంది ఇంకా చేయనే లేదు. మొత్తం 35 మంది ఉద్యోగులకు సంబంధించిన వేతనాలను మాన్యువల్‌గా చేసి డీటీవో కార్యాలయానికి పంపామని సిబ్బంది చెబుతున్నారు. ఉద్యోగాలు వచ్చిన వారు దఫాల వారీగా జాయిన్ అయ్యారని, అందుకే వేతనాలు ఆలస్యమయ్యాయని అంటున్నారు. అందరి వేతనాలు ఒకేసారి చేయాల్సి ఉంటుందని, అందుకే ఇప్పటివరకు వేతనాలు చేయలేదని అంటున్నారు. ఈ నెలలో వేతనాలు చేసి పంపుతామని చెబుతున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు: సీపీ

సుబేదారి, ఏప్రిల్ 8: ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. బెట్టింగ్ యాప్స్ మోజులో పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. వరంగల్ సీపీ పరిధిలో ఈ సీజన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన నాలుగు కేసుల్లో 9 మందిని అరెస్ట్ చేసి, నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ. 42.68 లక్షలు లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని, కాకినాడకు చెందిన వీరమణి కుమార్‌ను అరెస్ట్ చేసి, అతడి బ్యాంకు ఖాతాల నుంచి రూ. 3 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని పేర్కొన్నారు.

కొమ్మాల ఆదాయం రూ. 9.16 లక్షలు

గీసుగొండ, ఏప్రిల్ 8: కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన 4 హుండీలను మంగళవారం ఈవో నాగేశ్వర్‌రావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో లెక్కించారు. రూ. 9,16,892 ఆదాయం సమకూరినట్లు వారు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, UPPU ANITHA R/o H.No. 2-105, Devunoor, Dharmasagar Mandal, Hanumakonda Dist - 506371, Telangana. My name changed as AIRRABELLY ANITHA DEVI (Old Name) to UPPU ANITHA (New Name) for all purposes.

PLOT FOR SALE
★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

దుగ్గొండి: దెబ్బతిన్న అరటితోటను చూపుతున్న బాధిత రైతు

నర్సంపేట: నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిలో భారీ గాలులకు పక్కన విరిగిపడిన సూచిక బోర్డు

నర్సంపేట: నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిపై విరిగిపడిన భారీ వృక్షాలను యంత్రాలతో తొలగిస్తున్న పోలీసులు

అతలాకుతలం

- ఈదురు గాలులకు నర్సంపేట నియోజకవర్గంలో తీవ్ర నష్టం
- నేలవాలిన వరి, మక్కజొన్న పంట, విరిగిన స్తంభాలు
- నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్‌కు అంతరాయం

ఖానాపురం శివారులో నేలవాలిన వరి పొలాలు

నర్సంపేట/దుగ్గొండి/ఖానాపురం, ఏప్రిల్ 8: నర్సంపేట డివిజన్‌లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చేతికొచ్చిన వరి, మక్కజొన్న పంట నేలవాలింది. మిర్చి, అరటి, మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. భారీ వృక్షాలు నేలకూలాయి. పలు గ్రామాల్లో ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో సరఫరా నిలిచిపోయింది. నర్సం పేట శివారు ద్వారకపేటలోని మామిడితోటలో కాయలు నేలరాలాయి. తీవ్ర ఆర్థిక నష్టం జరిగినట్లు తోట యజమాని సమ్మయ్య వాపోయాడు. మహేశ్వరం, లక్నేపల్లి గ్రామాల్లో నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై పెద్ద చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో వాహన రాకపోకలకు అంత రాయం ఏర్పడింది. నర్సంపేట టౌన్ సీఐ రమణ మూర్తి, ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో యంత్రాలతో చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అలాగే, దుగ్గొండి మండలంలోని మక్కజొన్న, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పక్క చేను రైతు చెత్తాచెదారానికి నిప్పు పెట్టగా ఈదురుగాలులకు చుట్టుపక్కల విస్తరించింది. దీంతో నాచినపల్లిలోని ఇజ్జగిరి సదయ్యకు చెందిన మూడెకరాల మెక్కజొన్నకు నిప్పు అంటుకుని పంట పూర్తిగా కాలిపోయింది. దీంతో సుమారు రూ. 3 లక్షల నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గిర్నిబావి, చలపర్తి, లక్ష్మీపురం, కేశవాపురంలో అరటి పంటకు తీవ్ర నష్టం వాటి ల్లినట్లు రైతులు తెలిపారు. ఖానాపురం మండలవ్యాప్తంగా వరి, మక్కజొన్న పంటలు నేలవాలాయి. పాకాల ఆయకట్టులోని వరి పొలా లు పలుచోట్ల నేలవాలాయి. కొన్ని రోజులపాటు వర్షాలు ఉన్న నేపథ్యం లో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నర్సంపేట: మహేశ్వరం శివారులో ఈదురుగాలులకు నేలవాలిన తెల్లజొన్న చేను

ఆకస్మాత్తుగా వీచిన గాలులు

నల్లబెల్లి/నెక్కొండ: ఆకస్మాత్తుగా సోమవారం రాత్రి వీచిన గాలులకు నల్లబెల్లి మండలంలో మక్కజొన్న, వరి పంటలు వందలాది ఎకరాల్లో నేలమట్టమయ్యాయి. ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అనేక చోట్ల స్తంభాలు నేలకూలాయి. భారీ వృక్షాలు ఇండ్లు, రోడ్లకు అడ్డుగా పడ్డాయి. భారీగా వీచిన గాలులకు రాత్రివేళలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చాలా గ్రామాల్లో ప్రజలు రాత్రంతా అంధకారంలో గడిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొందే దశలో మాయదారి గాలిదుమారం నష్టం కలిగించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నల్లబెల్లి మండలంలోని లక్ష్మీతండాలో నిప్పంటుకుని మూడెకరాల మొక్కజొన్నపంట కాలిబూడిదైంది, గడ్డివాములు దగ్గమయ్యాయి. నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లె, బుచ్చిరెడ్డిపల్లె, కొండాపూర్, అసరవెల్లి, కన్నారావుపేట, అర్వయ్యపల్లె, చిలుకమ్మనగర్‌లో రేకుల షెడ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా కుటుంబాలు రాత్రంతా భయం గుప్పెట్లో గిడిపాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు. నెక్కొండ మండలంలోని అజ్మీరమంగ్యాతండాలో ఈదురుగాలులకు పాడిగేదెల షెడ్ కూలిపోయింది. తమను ఆదుకోవాలని బాధితులు తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కోరారు. మండలంలోని పనికరలో నెక్కొండ-నర్సంపేట ప్రధాన రహదారిపై చెట్టు కూలిపోయింది. పంటలకు నష్టం వాటిల్లింది.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ

కేఎంసీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 8: వైద్య వృత్తిపై ప్రజల్లో ఉన్న గౌరవాన్ని మరింత పెంచేలా వైద్యులు కృషి చేయాలని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి కోరారు. కాకతీయ మెడికల్ కళాశాలలో 2019 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు మంగళవారం రాత్రి 61వ గ్రాడ్యుయేషన్ డేను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. వైద్య వృత్తిని ఎంచుకున్న వారికి బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం 2019 విద్యా సంవత్సరానికి చెందిన 230 మంది విద్యార్థులకు వైద్య పట్టాలు అందజేశారు. అనంతరం వైద్య విద్యార్థులు తమ మిత్రులు, కుటుంబ సభ్యులతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. కార్యక్రమంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, కళాశాల విభాగాధిపతులు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మురళి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నినాదాలు చేస్తున్న లలితాయాదవ్

'రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం'

కరీమాబాద్, ఏప్రిల్ 8: బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభను కలిసికట్టుగా విజయవంతం చేద్దామని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్ పిలుపునిచ్చారు. వరంగల్ 43వ డివిజన్‌లో మంగళవారం ఉద్యమకారులు, సీనియర్ నాయకులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితాయాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ 25 ఏళ్లుగా ప్రజల ఆశయాలకనుగుణంగా పని చేస్తున్నదన్నారు. ఎల్కతుర్తిలో జరగనున్న సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఉద్యమకారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి

కాశీబుగ్గ: బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు శ్రేణులు భారీగా తరలిరావాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను సారంగపాణి(జేఎస్‌పీ) కోరారు. వరంగల్‌లో జరిగే బహిరంగ సభతో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

సుభద్రాదేవికి నివాళులర్పిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు

సుభద్రాదేవికి నాయకుల నివాళి

పరకగిరి, ఏప్రిల్ 8: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మేనత్త, వరంగల్ ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి నారాయణరావు తల్లి సుభద్రాదేవి దశదినకర్మను మంగళవారం ఏనుగల్లులో నిర్వహించారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభద్రాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరంగల్ అర్బన్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ సర్పంచ్ తక్కళ్లపల్లి భాస్కర్‌రావు, టీ వరదరాజేశ్వరరావు, లలితాయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, మాజీ ఎంపీటీసీ లింగమూర్తి, ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ ప్రముఖులు, పాలకుర్తి, వర్ధన్నపేట నాయకులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'లో గందరగోళం

ఖిలావరంగల్, ఏప్రిల్ 8: రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో గందరగోళం నెలకొందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌వీర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి ప్రభుత్వం నుంచి రుణాలు అందేలా చూడాలని కోరారు. బ్యాంక్ మేనేజర్లు, ఎల్డీఎంలతో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారులకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 9 లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఇంకో పది లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. బడ్జెట్ కేటాయింపులను బట్టి చూస్తే ఇంత మందికి పథకం అమలు చేయడం సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ నాయకులకే లబ్ధి చేకూరుతుందనే ప్రచారం జరుగుతున్నదని, అపోహలు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ధర్నా నిర్వహిస్తున్న హాస్టల్ కార్మికులు

కేఎంసీ హాస్టల్ కార్మికుల ధర్నా

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 8: కాకతీయ మెడికల్ కళాశాల పరిధిలోని ఉమెన్స్, మెన్స్ హాస్టళ్లలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కేఎంసీ హాస్టల్ వర్కర్స్ విభాగం ఆధ్వర్యంలో కార్మికులు విధులు బహిష్కరించి కళాశాల హాస్టల్ ఎదుట ఆందోళన చేశారు. ఏడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలని కోరారు.

స్కూల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నర్సంపేట, ఏప్రిల్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ వర్కర్ల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై 9 నెలలు గడిచినా పెండింగ్ వేతనాలు నేటికీ విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి జీవో ప్రకారం పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేదంటే దశల వారీగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

'తాగునీటి సమస్య లేకుండా చూడాలి'

సంగెం, ఏప్రిల్ 8: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా నిరంతరం సరఫరా చేసేలా చూడాలని ఎంసీపీఐ(యూ) నాయకుడు ఇస్మాయిల్ అన్నారు. మంగళవారం ఆయన పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో రవీందర్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని కొన్ని వార్డుల్లో మిషన్ భగీరథ పనులు పూర్తి అయినప్పటికీ వాటి ద్వారా కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేక పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని, కొన్ని సొంత భవనాలు లేక అందులో అద్దెకు ఉన్న ఇండ్లల్లో సైతం విద్యుత్ లేక టీచర్లతోపాటు పిల్లలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు రాజు, రాంచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాప్యం లేకుండా యారన్ సరఫరా చేస్తాం

- హైదరాబాద్ ఎన్‌హెచ్‌డీసీ చీఫ్ మేనేజర్ గణేశ్
- 'నమస్తే' కథనానికి స్పందన

మట్టెవాడ సంఘంలో తయారు చేసిన కార్పెట్లను పరిశీలిస్తున్న గణేశ్

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 8: చేనేత సంఘాలకు అవసరమైన యారన్ (నూలు)ను జాప్యం లేకుండా సరఫరా చేస్తామని హైదరాబాద్ నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌డీసీ) చీఫ్ మేనేజర్ గణేశ్ అనారు. 'యారన్ పంపిణీలో జాప్యం', ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్న చేనేత సంఘాలు' శీర్షికన గత నెల 13న నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించి కొత్తవాడలోని మట్టెవాడ చేనేత పారిశ్రామిక సంఘంలో మంగళవారం చేనేత సంఘాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. నేత సంఘాల ప్రతినిధులు ఇండెట్ పెట్టిన పది రోజుల్లో యారన్ పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ముందుగా యారన్‌పై 15 శాతం అడ్వాన్స్ చెల్లించాలని, యారన్ వచ్చిన తర్వాత మిగతా డబ్బులు కట్టి తీసుకోవాలని సూచించారు. సంఘాలు కోరుకున్న నెలా కోయంబత్తూరు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు లేదా వారికి ఇష్టమొన్న చోట్ల నుంచి క్వాలిటీ యారన్ తెప్పిస్తామని, గతంలో మాదిరిగా ఇండెంట్ ఆన్‌లైన్‌లో విజయవాడ నుంచి కాకుండా వరంగల్ కార్యాలయం నుంచే పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. వరంగల్‌లో చేనేత ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని నిబంధనల ప్రకారం సకాలంలో యారన్‌ను చేరవేస్తామని హామీ ఇచ్చారు. యారన్ పంపిణీలో ఇబ్బందులు, సమస్యలున్నా తనకు నేరుగా ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం సంఘంలో తయారు చేస్తున్న కార్పెట్లు, బెడ్‌షీట్లను పరిశీలించారు. చాలా బాగున్నాయంటూ కితాబుబిచ్చారు. ఆయన వెంట టెస్కో డీఎంవో వెంకటేశ్వర్లు, ఎన్‌హెచ్‌డీసీ అసిస్టెంట్ మేనేజర్ కేశిరెడ్డి బస్వరాజు, డిప్యూటీ మేనేజర్ సాయిబాలసుబ్రమణ్యం, చేనేత సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు ఉన్నారు.

జాబ్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, ఏప్రిల్ 8: వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఎంకేనాయుడు కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 11న నిర్వహించనున్న జాబ్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. టాస్క్ సంస్థ సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. 60కు పైగా వర్చుసా, జంపాక్, ఫ్యాక్ కోన్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొనన్నట్లు చెప్పారు. యువత పెద్ద ఎత్తున హాజరయ్యేలా మెప్మా, డీఆర్డీవో, జిల్లా సంక్షేమ, యువజన, ఉపాధి కల్పన శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ప్రత్యేక అధికారి శ్రీరాములు శ్రీనివాస్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి, ఏసీపీ నందిరాం పాల్గొన్నారు. అలాగే, కలెక్టర్ జిల్లా పరిశ్రమలు ప్రోత్సాహక కమిటీ(డీఐపీసీ) సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమన్నారు. టీజీ ఐపాస్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా వివిధ శాఖల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి మంజూరుకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అంతేకాకుండా ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై సమీక్షించారు. భారత ప్రభుత్వం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందించే ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండో దశ దరఖాస్తుల గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. pminternship. mca.gov.in. పోర్టల్ ద్వారా నైపుణ్యం కలిగిన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 1800116090లో సంప్రదించాలని కోరారు.

అనాథ యువతికి చేయూత

నీట్‌లో శిక్షణ కోసం ఆర్థిక సాయం



అంజలికి నీట్ కోచింగ్‌లో అడ్మిషన్ ఇప్పించిన రాజేంద్రప్రసాద్

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 8: అనాథ శరణాలయంలో ఉంటూ చదువుకుంటున్న యువతి ఉన్నత చదువుల కోసం నీట్‌లో శిక్షణ ఇప్పించేందుకు 'మనం స్వచ్ఛంద సంస్థ' సభ్యులు చేయూతనందించేందుకు ముందుకొచ్చారు. వరంగల్ సమీపంలోని అనాథ శరణాలయంలో ఉంటున్న అంజలి తెలుగు మీడియంలో తన విద్యాభ్యాసం కొనసాగిస్తున్నది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అంజలి ఉన్నత చదువుల కోసం ఎదురుచూస్తున్నది. ఇందులో భాగంగా నీట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుని డాక్టర్ కోర్సు పూర్తిచేసి పేదలకు వైద్య సేవలు అందించాలనేది అంజలి లక్ష్యం. ముందుగా కోచింగ్‌కు తీసుకోవడానికి అవసరమైన ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో పోచమ్మమైదాన్ ప్రాంతానికి చెందిన 'మనం స్వచ్ఛంద సంస్థ' వ్యవస్థాపక అధ్యక్షుడు గోళ్ల రాజేంద్రప్రసాద్ సహాయ సహకారాలు అందించేందుకు ముందుకొచ్చారు. అంజలికి చదువుపై ఉన్న పట్టుదలను చూసిన సంస్థ సభ్యులు కూడా చలించి ఆమెకు కోచింగ్ ఇప్పించడానికి సిద్ధమయ్యారు. విద్యతోపాటు హాస్టల్ సదుపాయానికి ఫీజు చెల్లిస్తామని వారు తెలిపారు. దీంతో నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అంజలికి శిక్షణ ఇవ్వడానికి అవసరమైన డబ్బులు మంగళవారం చెల్లించినట్లు సంస్థ నిర్వాహకుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. అంజలి బాగా చదువుకొని సమాజానికి ఉపయోగపడే మంచి డాక్టర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంజలికి సహాయం చేసినందుకు సంస్థ సభ్యులు శైలేశ్, దీపిక, నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నిందితుల రిమాండ్

రూ. 10.86 లక్షల విలువైన గంజాయి పట్టివేత

నల్లబెల్లి, ఏప్రిల్ 8: గంజాయి తరలిస్తున్న నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సాయిరమణ తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్సై గోవర్ధన్ నేతృత్వంలో సోమవారం నారక్కపేటలోని 365 జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రోడ్డుపై ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించి పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. ఈ క్రమంలో వారిని వెంబడించి పట్టుకుని బ్యాగులను పరిశీలించారు. వారి నుంచి 21.73 కిలోల ఎండు గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన ప్రవీణ్ శివ బాదర్గే, అతడి భార్య వర్ష శంబాజీకటేగా గుర్తించామని తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 10.86 లక్షలు ఉంటుందన్నారు.

బైక్‌కు నిప్పుపెట్టిన వారిపై కేసు నమోదు

కరీమాబాద్, ఏప్రిల్ 8: ఇంటి ఎదుట నిలిపిన తన బైక్‌కు నిప్పటించారని శివనగర్‌కు చెందిన అనుముల రమేశ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

నర్సంపేట, ఏప్రిల్ 8: వేసవిలో నర్సంపేట నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చూడాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలుంటే అక్కడికక్కడే త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నర్సంపేట పట్టణంలో జరుగుతున్న అమృత్ పనులను వేగవంతం చేయాలన్నారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

చెన్నారావుపేట, ఏప్రిల్ 8: నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాక్సిన్ నిల్వ చేసే గది, రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి కేటాయించిన టీకాలు వేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

మొరం దందాను అరికట్టాలి

నెక్కొండ, ఏప్రిల్ 8: అప్పల్‌రావుపేటలో కొనేళ్లుగా మొరం దందా కొనసాగుతున్నదని పోలీసులకు ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పడం, రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తే విచారణ చేసే సమయానికి అక్రమార్కులు యంత్రాలు, ట్రాక్టర్లను అక్కడి నుంచి తప్పిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారుల తంతు ముగియగానే మళ్లీ మొరం దందాకు తెరలేవడం ఇక్కడ సర్వసాధారణమైందని తెలిపారు. తాజాగా సాయిరెడ్డిపల్లెకి చెందిన బాధితులు గుట్టపక్కనున్న తమ పట్టా భూముల్లో మూడు రోజులుగా యంత్రాలతో మొరం తవ్వి ట్రాక్టర్లలతో తరలిసున్నారని మంగళవారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు అందాయని, కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ స్వర్ణలత

ఘనంగా గార్డియన్ ఆస్పత్రి వార్షికోత్సవం

వరంగల్, ఏప్రిల్ 9: నగరంలో 15 ఏళ్లుగా పేదలకు మల్టీస్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నట్లు గార్డియన్ ఆస్పత్రి అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కాళీప్రసాద్ తెలిపారు. ములుగురోడ్డులోని గార్డియన్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బందితో కలిసి డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ స్వర్ణలత కేక్ కట్ చేశారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగించాలని ఆదేశిస్తున్న మేయర్

బల్దియా ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలి

వరంగల్, ఏప్రిల్ 8: బల్దియా ప్రధాన కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో పలు విభాగాల చాంబర్లను తనిఖీ చేసి, ఉద్యోగుల జాబ్‌చార్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ సెల్లార్‌ను పరిశీలించి, ఉద్యోగులు, కార్పొరేటర్ల వాహనాలు కాకుండా ప్రైవేట్ వాహనాలు అక్కడ పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలించి దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తి చేసే విధానాన్ని పరిశీలించారు. జనన-మరణ విభాగంలో ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. అలాగే, కార్పొరేషన్‌లో వింగ్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. బల్దియా ప్రధాన కార్యాలయ భవనానికి కొత్త రంగులు వేయాలని అధికారులను ఆదేశించారు.



ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే చర్యలు

దుగ్గొండి, ఏప్రిల్ 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన కార్యక్రమాల అమల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో సాంబశివరావు హెచ్చరించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీ సెంటర్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేసుకోవాలని, ప్రతి వ్యక్తి వాటర్ బాటిల్ వెంట తీసుకెళ్లాలని, కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట సీసీ నాగరాజు, డాక్టర్లు వనమాల, భరత్‌కుమార్, పథ్వీ, రాకేశ్, సీహెచ్‌వో సలోమి, సాంబయ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.



న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్డులోని లోటస్ రెసిడెన్సీలో మంగళవారం నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న నెక్కొండ హైస్కూల్ 1973-74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు